సాక్షి
కామారెడ్డి
శనివారం । 28 । జనవరి । 2023

గరిష్టం/కనిష్టం
34.1 /11.1
వాతావరణం
పొగ మంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలితీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి పదోన్నతుల దరఖాస్తులు

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల దరఖాస్తు ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు హార్డ్ కాపీని ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీవరకు అప్పగించాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు హెచ్‌ఎంలకు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు హార్డ్ కాపీలను అందించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

అర్ధరాత్రి వరకు కొనసాగిన వెరిఫికేషన్..
జిల్లాలో 414 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందులో 105 పీజీ హెచ్‌ఎం పోస్టులు, 309 స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం 1,200లకు ఎస్‌జీటీల సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కోసం 220కిపైగా ఎస్‌ఏల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. కాగా ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాను శుక్రవారమే ప్రకటించాల్సి ఉంది. సర్టిఫికెట్ల పరిశీలన అర్ధరాత్రి వరకు కొనసాగడంతో జాబితా ప్రకటించలేకపోయారు. శనివారం సీనియారిటీ జాబితా ప్రకటించనున్నారు.

నేడు నిజామాబాద్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన



ఖలీల్‌వాడి: మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ శనివారం నిజామాబాద్ నగరంలో పర్యటించనున్నారు. నగరంలోని కళాభారతి, ఆర్‌యూబీ(రైల్వేకమాన్ రోడ్డు) పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ నారాయణరెడ్డి, పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు శుక్రవారం పరిశీలించారు.

భారీ బందోబస్తు
మంత్రి పర్యటన సందర్భంగా నగరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. సీపీ నాగరాజు పర్యవేక్షణలో నలుగురు డీసీపీలు, 8మంది ఏసీపీలు, 50మంది సీఐలు, 80 మంది ఎస్సైలు, 700మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. పులాంగ్, పాత కలెక్టరేట్, కొత్త కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుతో పాటు మంత్రి పర్యటన జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో నేడు రథసప్తమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేడుకల్లో భాగంగా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రథోత్సవంలో భాగంగా ఈ సారి స్వామివారి ఉత్సవమూర్తులను కొత్తగా తయారు చేయించిన రథంపై ఊరేగించనున్నారు. గతేడాది పాతరథంపై ఊరేగింపు చేయగా కొన్ని ఇబ్బందులు వచ్చాయి. దీంతో రూ. 50 లక్షలతో కొత్త రథాన్ని తయారు చేయించారు. కొత్త రథాన్ని శుక్రవారం ఉమ్మడి జిల్లాల దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రథం పనులు చివరిదశకు చేరుకోవడంతో శనివారం వరకు రథం పనులు 90శాతం పూర్తవుతాయని రథ శిల్పి బాల బ్రహ్మచారి కమిషనర్‌కు తెలిపారు. హంపీ ఆలయ నిర్మాణానికి ఉపయోగించిన బండరాయితోనే రథ చక్రాలను తయారీ చేయించగా వీటిని ఇప్పటికే బిగించారు.

మహిళా కళాశాలలో పాములు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్‌లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా పాములు భయపెడుతున్నాయని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. పాములు చెట్లపై నుంచి బాత్రూములోకి వస్తున్నాయని, మరోవైపు కొండచిలువలు సైతం ప్రాంగణంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారు.

కరంటు కష్టాలు

- రాత్రి వేళలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా
- తరచూ ట్రిప్ అవుతుండడంతో కాలుతున్న మోటార్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



వ్యవసాయానికి పగటి పూట 12 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న ప్రభుత్వ ప్రకటనలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. జిల్లాలో ఆరేడు గంటలు కూడా సరిగా సరఫరా కాకపోవడం, అదీ రాత్రి పూట ఇస్తుండడంతో అన్నదాతలు ఇబ్బందిపడుతున్నారు. నాణ్యమైన విద్యుత్ అందక మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిజాంసాగర్ : జిల్లాలో 1.5 లక్షలపైచిలుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. రైతులు బావులు, బోరుబావులతోపాటు ప్రాజెక్టుల కింద యాసంగి పంటలు సాగు చేస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతోంది. జిల్లాలో యాసంగి వరి నాట్లు దాదాపు పూర్తి కావచ్చాయి. వ్యవసాయానికి పగటిపూట 12 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే ఇది క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ఆరేడు గంటలే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అదీ రాత్రి పూట ఇస్తుండడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. మక్క, జొన్న వంటి ఆరుతడి పంటలకు సాగు నీరు అంతగా అవసరం లేకపోయినా.. వరికి ఎక్కువ నీరు అవసరం అవుతుంది. మొదట్లో పగటి పూటే 12 గంటల పాటు కరెంటు అందించారు. కానీ నాలుగైదు రోజులకింద కరెంటు కష్టాలు మొదలయ్యాయి. పగటి పూట కాకుండా రాత్రి పూట విద్యుత్ సరఫరా చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు రాత్రి 10.30 గంటల నుంచి తెల్లవారుజామున 4.30 గంటల వరకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేశారు. గురువారం రాత్రి 8 గంటలనుంచి 10.30 గంటలవరకు కరెంటు సరఫరా చేశారని, మళ్లీ శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలనుంచి 6 గంటల వరకు, ఆ తర్వాత ఉదయం 10.30 గంటలనుంచి 3.30 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ ఇచ్చారని తెలిపారు. విద్యుత్ అంతరాయాలతో పారిన మడే మళ్లీ పారుతోందని పేర్కొంటున్నారు. విద్యుత్ ట్రిప్ అవుతుండడంతో మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందని పేర్కొంటున్నారు. రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లడమూ ఇబ్బందికరంగా ఉంటోందంటున్నారు. పగటి పూట నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మరమ్మతుల భారం..



నిజాంసాగర్: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కాకపోవడంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నర్వ శివారులో కరంటు కోతలలో రెండు మోటార్లు కాలిపోయాయి. దీంతో వాటిని మరమ్మతులకోసం తరలించడానికి రైతులు నానా పాట్లు పడ్డారు.

ఎప్పుడస్తదో తెలుస్తలేదు..



యాసంగిలో అప్పుడే కరెంటు కష్టాలు మొదలయ్యాయి. త్రీఫేజ్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు. సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసినా వాళ్లు సమాధానం చెబుతలేరు. రాత్రి పూట కరెంట్ ఇస్తే పంట పొలాలకు వెళ్లడం కష్టం అవుతుంది. పగటి పూటే ఇవ్వాలి.

– మిదత సాయిలు, రైతు, మహమ్మద్‌నగర్

పగటి పూట ఇవ్వాలి



నాలుగైదు రోజులనుంచి వ్యవసాయానికి రాత్రి పూట కరంటు ఇస్తున్నారు. దీంతో పొలాలకు వెళ్లడం కష్టమైతుంది. పగటి పూట కరంటు ఇస్తే పంటలకు నీళ్ల పారించడం సులువవ్వుతుంది. ఇష్టమొచ్చినట్లు కరెంటు తీసేస్తుండడంతో మోటార్లు కాలిపోతున్నాయి.

– నాగేశ్వర్‌రావు, రైతు, మహమ్మద్‌నగర్

త్వరలో పరిష్కారం

విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని భావిస్తున్నాం. తర్వాత వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం.

– రమేష్‌బాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ



కిలిమంజారో పర్వతంపై వెన్నెల

కిలిమంజారోను అధిరోహించిన వెన్నెల

సాక్షి, కామారెడ్డి: మాచారెడ్డి మండలంలోని సోమారంపేటకు చెందిన గిరిజన విద్యార్థి బానోత్ వెన్నెల కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది. ఆమె ఈనెల 19 వ తేదీన పర్వతారోహణకు బయలుదేరింది. గణతంత్ర దినోత్సవం రోజున శిఖరాన్ని చేరుకుంది.

కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న వెన్నెలకు పర్వతారోహణ అంటే మక్కువ. నిరుపేద అయిన ఆమె ఇటీవల కిలిమంజారో పర్వతారోహణకు ఎంపికైంది. అయితే అక్కడికి వెళ్లేందుకు రూ. 3 లక్షల వరకు ఖర్చవుతాయని తెలియడంతో డీలాపడింది. చేతిలో డబ్బులు లేకపోవడంతో పర్వతారోహణ చేయాలన్న కల నెరవేరదేమోనని ఆందోళన చెందింది. ఈ విషయమై 'వెన్నెల శిఖరం చేరేదెలా' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనంపై రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ స్పందించారు. రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు. దీంతో వెన్నెల కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి తన కలను సాకారం చేసుకుంది.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



ఏఎస్పీ అన్యోన్యకు కంటి అద్దాలను అందజేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: కంటి వెలుగు శిబిరాన్ని పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ పాటిల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారు ఈ శిబిరం ద్వారా కంటి అద్దాలు, మందులు ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు కంటి అద్దాలను కలెక్టర్ అందించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం..

కామారెడ్డి క్రైం: చిరుధాన్యాలు వినియోగిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా శుక్రవారం కామారెడ్డి మార్కెట్ యార్డ్ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాలతో పౌష్టికాహారం అందుతుందని, వ్యాధులూ దూరం అవుతాయని పేర్కొన్నారు. రైతులు జొన్నలు, సామలు, సజ్జలు, రాగులు పండించే విధంగా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. చిరుధాన్యాలతో తయారుచేసిన పిండి వంటలను కలెక్టర్ పరిశీలించారు. పిండివంటలు తయారుచేసిన వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, వ్యవసాయ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



చిరు ధాన్యాలతో చేసిన పిండివంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

కామారెడ్డి క్రైం: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి ఆమె శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మన ఊరు -మన బడి, ఉపాధ్యాయుల బదిలీ అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. బదిలీలలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. జిల్లాలో మన ఊరు -మన బడికి సంబంధించి 13 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితా కూడా సిద్ధమైందన్నారు. వీసీలో జిల్లా నుంచి డీఈవో రాజు, సమన్వయకర్తలు శ్రీపతి, గంగాకిషన్, మనోహర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల కాజేత



మాట్లాడుతున్న ఎంపీపీ గరీబున్నీసా బేగం



ఎంపీవోను నిలదీస్తున్న కార్యదర్శులు

- తన ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకున్న కంప్యూటర్ ఆపరేటర్
- ఎంపీవోను నిలదీసిన కార్యదర్శులు

లింగంపేట: మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్ డిజిటల్ కీ ఉపయోగించి పంచాయతీల నిధులు కాజేశాడు. కంప్యూటర్ ఆపరేటర్ ఏడు గ్రామ పంచాయతీలకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను కాజేశాడని ఎంపీపీ గరీబున్నిసాబేగం తెలిపారు. ఆమె శుక్రవారం మండల పరిషత్‌లో విలేకరులతో మాట్లాడారు. కంప్యూటర్ ఆపరేటర్ ఈనెల 24న పర్మళ్ల, మెంగారం, సజ్జన్‌పల్లి, ముంబోజీపేటతండా, కోమట్‌పల్లి, కన్నాపూర్, రాంపల్లి జీపీలకు సంబంధించిన రూ. 2.96 లక్షల నిధులను డిజిటల్ కీ ద్వారా తన ఖాతాలోకి మళ్లించుకున్నాడన్నారు.

ఎంపీవో నిలదీత
ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు శుక్రవారం ఎంపీవో ప్రభాకరచారిని నిలదీశారు. ఇటీవల పంచాయతీల యాక్షన్ ప్లాన్ తయారు చేయడానికి కార్యదర్శులు డిజిటల్ కీని కంప్యూటర్ ఆపరేటర్‌కు అప్పగించాలని ఎంపీవో ఆదేశించారన్నారు. గ్రామ పంచాయతీల ట్రాక్టర్ల ఖర్చుల కోసం డిజిటల్ కీ ఇవ్వగా.. ఆ నిధులను కంప్యూటర్ ఆపరేటర్ తన ఖాతాలో జమ చేసుకున్నాడన్నారు. 25 వ తేదీ నుంచి అతడు విధులకు రావడం లేదని, ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోందని పేర్కొన్నారు. ఎంపీవో నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని ఆరోపించారు. నిధులు కాజేసిన కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీవో ప్రభాకరచారి తెలిపారు.

జిల్లా ఆస్పత్రి సందర్శన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిని శుక్రవారం లక్ష్య బృంద సభ్యులు సందర్శించారు. బృంద సభ్యులు డాక్టర్ వి.రాజసెల్వం, డాక్టర్ శ్వేతాచరణ్‌లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మితో మాట్లాడి లేబర్‌రూం, ఆపరేషన్ థియేటర్‌ల వివరాలు తె లుసుకున్నారు. రెండేళ్లకోసారి కేంద్రం నుంచి లక్ష్య బృందాలు ఆస్పత్రులను సందర్శిస్తాయి. జిల్లాకేంద్ర, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలలో ఆపరేషన్ థియేటర్లు, లేబర్‌రూంలను తనిఖీ చేస్తారు. మహిళలు, బాలింతలకు అందుతున్న సేవలు, ఆస్పత్రులలో సౌకర్యాలను పరిశీలించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. వారు ఇచ్చే పాయింట్ల ఆధారంగా కేంద్రం అవార్డులు ప్రకటించి నిధులు మంజూరు చేస్తుంది.



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న 'లక్ష్య' సభ్యులు

సరిపోని సబ్ జైలు!

- జిల్లాలో పెరుగుతున్న కేసులు, రిమాండ్‌లు
- వినియోగంలో ఒకే సబ్ జైలు
- దాని కెపాసిటీ పది మంది మాత్రమే..
- మిగతా వాళ్లను నిజామాబాద్‌కు తరలిస్తున్న వైనం

జిల్లాలో నేరాల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూనే ఉంది. నేరాలకు పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిస్తుంటారు. అయితే జిల్లా కేంద్రంలో ఒకటే సబ్‌జైలు ఉంది. అందులో పది మంది మాత్రమే ఉండేందుకు అనువుగా ఉంది. దీంతో మిగతా రిమాండ్ ఖైదీలను నిజామాబాద్ జైలుకు తరలించాల్సి వస్తోంది.



కామారెడ్డి పట్టణంలోని సబ్‌జైలు

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లాగా ఆవిర్భవించాక ఒక్కొక్కటిగా దాదాపు అన్ని కోర్టులు ఇక్కడ ఏర్పాటయ్యాయి. జిల్లా కోర్టు, అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు, పోక్సో కోర్టు, బాల నేరస్తుల కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయి. అలాగే ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద పట్టణాల్లో జేఎఫ్‌సీఎం కోర్టులున్నాయి. ఆయా నేరాలకు సంబంధించి నేరస్తులను కోర్టులో హాజరుపరచడం, కేసు తీవ్రతను బట్టి వారిని రిమాండ్‌కు పంపడం చేస్తుంటారు.

సబ్‌జైలులో పదిమందికే..
కామారెడ్డిలో కోర్టుల్లో వివిధ కేసులకు సంబంధించి దాదాపు రోజూ రిమాండ్‌లు ఉంటున్నాయి. బెయిల్ వచ్చేవరకు నిందితులు రిమాండ్‌లో ఉంటారు. జిల్లాలో కేసుల సంఖ్యను పరిశీలిస్తే జుడీషియల్ రిమాండ్‌లో దాదాపు 60 నుంచి 70 మంది దాకా ఉంటున్నారు. జిల్లాకేంద్రంలో ఉన్న సబ్ జైలులో 10 మందికి మాత్రమే అకామిడేషన్ ఇవ్వగలరు. కామారెడ్డి సబ్ జైలు కెపాసిటీ తక్కువ కావడంతో అదనంగా రిమాండ్‌కు పంపాల్సిన వారినందరినీ నిజామాబాద్ జిల్లా జైలుకు తరలిస్తున్నారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద కోర్టుల్లో రిమాండ్ ఖైదీలనూ నిజామాబాద్‌కే పంపిస్తున్నారు.

ములాఖత్‌లకు ఇబ్బంది..
కామారెడ్డి సబ్ జైలులో స్థలం సరిపోకపోవడంతో చాలామంది రిమాండ్ ఖైదీలను నిజామాబాద్ జైలుకు తరలిస్తున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ములాఖత్‌కు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. సారంగాపూర్ సమీపంలో ఉన్న జైలుకు వెళ్లడానికి రిమాండ్ ఖైదీల కుటుంబ సభ్యులు వ్యయ ప్రయాసలకు ఓర్చాల్సి వస్తోంది. సాధారణంగా క్షణికావేశంలో గొడవలు, దాడులకు దిగి కేసులపాలయ్యే వారిలో అత్యధికులు పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉంటారు. వారు రిమాండ్‌లో ఉన్నపుడు కుటుంబ సభ్యులు కలిసి మాట్లాడాలంటే ఇబ్బంది పడుతున్నారు. జిల్లా జైలు ఏర్పాటు చేస్తే ములాఖత్‌లకు ఇబ్బందులు తప్పుతాయి.

జిల్లా జైలు ఏర్పాటయ్యేనా?

జిల్లా కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిపై కోర్టుల సముదాయ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే స్థలాన్ని కేటాయించింది. ఆ ప్రాంతంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. జిల్లా జైలు కోసం 20 ఎకరాల స్థలం అవసరం అవుతుందని జైళ్ల శాఖ అధికారులు అంటున్నారు. జిల్లా జైలుకు స్థలం కేటాయిస్తే, జైలు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.



ఎల్లారెడ్డిలో ముళ్లపొదల్లో ఉన్న సబ్‌జైలు భవనం

ముళ్లపొదల్లో ఎల్లారెడ్డి సబ్‌జైలు..

ఎల్లారెడ్డి పట్టణంలో రెండు దశాబ్దాల క్రితమే సబ్‌జైలు నిర్మించారు. అక్కడ పది మంది రిమాండ్ ఖైదీలను ఉంచొచ్చు. సబ్ జైలును ప్రారంభించకముందే అప్పట్లో నక్సలైట్లు జైలు భవనంపై దాడి చేశారు. దీంతో సబ్‌జైలు ప్రారంభాన్ని విరమించుకున్నారు. అయితే అప్పటికే సబ్ జైలుకు డిప్యూటీ జైలర్ పోస్టుతో పాటు, ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక జూనియర్ అసిస్టెంట్, నాలుగు కానిస్టేబుల్ పోస్టులను మంజూరు చేశారు. సబ్ జైలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో అప్పటి నుంచి అక్కడ పోస్టింగులో ఉన్న వారు డిప్యూటేషన్లపై కామారెడ్డి, నిజామాబాద్ జైళ్లలో విధులు నిర్వహిస్తున్నారు. వినియోగంలో లేకపోవడంతో సబ్ జైలు భవనం తుమ్మ చెట్లతో నిండిపోయింది. ముళ్ల పొదలను తొలగించి భవనాలకు మరమ్మతులు చేయిస్తే వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా

పనులను వేగవంతం చేయాలి



వర్ని: సిద్దాపూర్ రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండలంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్పీకర్ మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, అనుకున్న సమయానికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. జెడ్పీటీసీ హరిదాసు, సర్పంచులు కలియబాయి దశరథ్, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

30న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ క్రీడామైదానంలో ఈ నెల 30న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెయూ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

శ్రీశైలం మృతి తీరని లోటు



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లా పశుగణాభివృద్ధి సంస్థలో ఏడీగా పని చేస్తున్న శ్రీశైలం మృతి శాఖకు తీరని లోటని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారీ అన్నారు. కోటగల్లీలోని శాఖ కార్యాలయంలో శుక్రవారం శ్రీశైలం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీశైలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీశైలం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఏడీ బాలిక్ అహ్మద్, కైసర్ అహ్మద్, జియావుద్దీన్, బస్వారెడ్డి, హన్మంత్ రెడ్డి, కిరణ్, రతన్, ప్రమోద్, ప్రభాకర్, గోపీకృష్ణ, శాఖ సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన బాలిక.. క్షేమంగా అప్పగింత



మాక్లూర్: మండలంలోని ఆంధ్రనగర్ శివారులోగల బీటీ రోడ్డుపై శుక్రవారం రాత్రి కానిస్టేబుల్ ముత్యంకు ఓ చిన్నారి కనిపించగా.. పోలీస్ స్టేషన్లో అప్పగించాడు. పోలీసులు విచారించగా బాలిక దుర్గానగర్ తండా ఎస్టీ మినీ గురుకులం పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న అర్చనగా గుర్తించారు. ఈ విషయమై గురుకులం వార్డెన్‌ను సంప్రదించగా అందుబాటులో లేరు. మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్‌ను వివరణ కోరగా.. బాలిక ఇచ్చిన సమాచారం మేరకు ఆమెను వారి తల్లి దండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు న్యాయసేవాసదన్‌లో కంటి వెలుగు శిబిరం

ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్‌లో కంటి వెలుగు శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ సూపరింటెండెంట్ రంగు పురుషోత్తం గౌడ్ తెలిపారు. ఉదయం పది గంటలకు న్యాయసేవ సంస్థ చైర్ పర్సన్, జిల్లా జడ్జి సునీత కుంచాల కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొంటారని తెలిపారు.

యువతకు క్రీడలు అవసరం



సీపీ నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సాక్షి బ్రాంచ్ మేనేజర్ మహేశ్





క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సాక్షి బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, సాక్షి టీవీ ప్రతినిధి రమణ



క్రీడాకారులతో సీపీ నాగరాజు, సాక్షి బృందం, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

- సీపీ కేఆర్ నాగరాజు
- అట్టహాసంగా ప్రారంభమైన 'సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ'

SAKSHI | సాక్షి | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

SUDHAKAR PIPES AND FITTINGS | LEADER IN QUALITY AND TECHNOLOGY | Regional sponsor

నిజామాబాద్‌నాగారం: యువత మంచిమార్గంలో ప్రయాణించాలంటే చదువుతోపాటు క్రీడలు అవసరమని సీపీ కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం 'సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ' అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించారు. సరదగా కాసేపు బ్యాటింగ్ చేసి, అనంతరం మాట్లాడారు. సాక్షి యాజమాన్యం యువతను, విద్యార్థులను ప్రోత్సహించడానికి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, యువత ప్రతినిత్యం తమకు నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. తద్వార జిల్లా నుంచి దేశానికి ఆడే స్థాయికి ఎదగాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్ కోసం పాటుపడాలన్నారు. క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఆడి టోర్నీని విజయవంతం చేయాలన్నారు. టోర్నీలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి జూనియర్, సీనియర్ విభాగంలో 26 జట్లు పాల్గొన్నాయి. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి సురేష్, కోచ్ పారస్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ పల్లె మహేష్, బ్యూరో ఇన్‌చార్జ్ తుమాటి భద్రరెడ్డి, సాక్షి టీవీ స్టాఫర్ రమణ, ఏఎస్ఎం మల్లికార్జున్‌యాదవ్, మూడోటౌన్ ఎస్సై శ్రావణ్, అంపైర్లు షారుఖ్, దుర్గాప్రసాద్, స్కోరర్ నయీమ్, గ్రౌండ్‌మెన్ నారాయణ పాల్గొన్నారు.

ప్రతినిత్యం సాధన చేస్తా..



ప్రతినిత్యం క్రికెట్‌లో ఉదయం, సాయంత్రం ప్రాక్టీసు చేస్తున్నాను. అందుకే 10ఓవర్లలో 24పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాను. నా ఇన్నింగ్స్ వల్ల మ్యాచ్ గెలవడం చాలా సంతోషంగా ఉంది. ఇదే ఉత్సాహంతో మరిన్ని మ్యాచ్‌ల్లో రాణించి సత్తా చాటుతాను.

–అశ్వంత్, ఎస్ఆర్ జూనియర్ కాలేజ్

హ్యాట్రిక్ సాధించాను..



టోర్నీ మొదటి మ్యాచ్‌లో హ్యాట్రిక్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఒక్క ఓవర్లలో నాలుగు వికెట్లు తీయడం నేను మరిచిపోలేను. సీనియర్ సలహా తీసుకోవడంతో బౌలింగ్‌లో మంచి పట్టు సాధించాను. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళతాను.

–సోహేల్, ఏహెచ్ఎంవీ

మొదటిమ్యాచ్‌లో 'గౌతమి' విజయం

టోర్నీ మొదటిమ్యాచ్‌లో కేర్ డిగ్రీ కళాశాల, గౌతమి కళాశాలలు పోటీపడ్డాయి. టాస్‌గెలిచి కేర్ జట్టు బ్యాటింగ్ చేయగా 10ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 45 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గౌతమి కళాశాల జట్టు 8ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 46 పరుగులు చేసి, విజయం సాధించింది.

15 పరుగుల తేడాతో ఎస్ఆర్ కళాశాల గెలుపు

రెండో మ్యాచ్‌లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల, శ్రీగాయత్రి జూనియర్ కళాశాల పోటీపడ్డాయి. టాస్ గెలిచిన ఎస్ఆర్ కళాశాల జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీగాయత్రి జట్టు 10ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి కేవలం 48 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎస్ఆర్ కళాశాల జట్టు 15 పరుగులతో గెలిచింది.

6 పరుగులతో 'శ్రీగాయత్రి' విజయం

మూడో మ్యాచ్‌లో శ్రీగాయత్రి కళాశాల, సాందీపనీ జూనియర్ కళాశాలలు పోటీపడ్డాయి. మొదట శ్రీగాయత్రి జట్టు బ్యాటింగ్ చేయగా 10ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 72పరుగులు చేసింది. అనంతరం సాందీపనీ జట్టు 10ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 66పరుగులు చేశారు. దీంతో శ్రీగాయత్రి జట్టు విజయం సాధించింది.

హరిచరణ్ మార్వాడిదే జయకేతనం

నాల్గో మ్యాచ్ హరిచరణ్‌మార్వాడి కళాశాల(ఏహెచ్‌ఎంవీ), సాందీపనీ జూనియర్ కళాశాల మధ్య జరిగింది. ఇందులో ఏహెచ్‌ఎంవీ మొదట బ్యాటింగ్ చేయగా 10ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. అనంతరం సాందీపనీ జట్టు 10ఓవర్లలో 65 పరుగులకు ఆలౌటైంది. దీంతో 8 పరుగుల తేడాతో ఏహెచ్‌ఎంవీ జట్టు గెలిచింది.

9వికెట్ల తేడాతో వీఆర్‌సీ విజయం



ఐదో మ్యాచ్‌లో వీఆర్‌సీ, ఎస్ఆర్ఎన్‌కే కళాశాల బాన్సువాడ తలపడ్డాయి. మొదట ఎస్ఆర్ఎన్‌కే జట్టు బ్యాటింగ్ చేయగా 10ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 58పరుగులు చేసింది. అనంతరం వీఆర్‌సీ జట్టు 8.2ఓవర్లలో ఒక్క వికెట్ నష్టపోయి, లక్ష్యాన్ని చేధించి విజేతగా నిలిచింది.





బ్యాటింగ్ చేస్తున్న సీపీ.. పోటీలను వీక్షిస్తున్న ముఖ్య అతిథులు





సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో పోటీపడుతున్న క్రీడాకారులు



వికెట్ తీసిన ఆనందంలో క్రీడాకారులు

క్రైం కార్నర్

శ్రీకాంత్‌ది హత్య కాదు.. ఆత్మహత్యే!

- ప్రేమ వ్యవహారమే కారణం
- వివరాలు వెల్లడించిన సీసీఎస్ ఏసీపీ రమేష్



మాట్లాడుతున్న సీసీఎస్ ఏసీపీ రమేష్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని పసుపువాగు వద్ద కుళ్లిన మృతదేహంతో లభించిన శ్రీకాంత్ అనే యువకుడిది హత్య కాదని ఆత్మహత్యే అని, సీసీఎస్ ఏసీపీ రమేష్ స్పష్టం చేశారు. శ్రీకాంత్‌ను బెదిరించి, ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన ఐదుగురిపై కేసునమోదు చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈమేరకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సీసీఎస్ ఏసీపీ రమేష్ వివరాలు వెల్లడించారు. బోధన్ మండలంలోని ఖండ్గాం గ్రామానికి చెందిన శ్రీకాంత్(20) పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో చదువుతున్న పెగడాపల్లి గ్రామానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం సాగించగా.. యువతి ఇంట్లో వీరి విషయం తెలిసింది. అనంతరం అమ్మాయి తల్లి తరపు బంధువులు సెప్టెంబర్ 23న శ్రీకాంత్‌కు ఫోన్ చేసి బెదిరించారు. అనంతరం వారు శ్రీకాంత్ ఇంటికి వెళ్లి అతడి తల్లిదండ్రులకు మీ అబ్బాయిని కట్టడిలో పెట్టాలని హెచ్చరించారు. దీంతో ఆ రోజు నుంచి శ్రీకాంత్ కనిపించకుండపోవడంతో మరుసటి రోజు అతడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, పోలీసులు విచారిస్తుండగా.. పసుపు వాగు వద్ద డిసెంబర్ 12న కుళ్లిపోయిన ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు శ్రీకాంత్ తల్లిదండ్రులకు సమాచారం అందించగా.. వారు మృతుడు తమ కుమారుడేనని గుర్తించారు. శ్రీకాంత్ తల్లిదండ్రులు తన కుమారుడిని ఎవరో హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు పోస్టుమార్టం రిపోర్టులో శ్రీకాంత్‌ది ఆత్మహత్య అని, హత్య కాదని తేలిందన్నారు. శ్రీకాంత్‌ను బెదిరించడం, ప్రేమ వ్యవహారం తన తల్లిదండ్రులకు తెలియడంతో పరువు పోయిందని భయపడి, మనస్తాపం చెంది చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన అన్నం వెంకటేశ్వర్ రెడ్డి, దేసిరెడ్డి పాపిరెడ్డి, సూర వెంకటేశ్వర్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, పల్లె తిరుమల రెడ్డిలపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. సీఐ ప్రేమ్‌కుమార్ సీసీఎస్ సీఐ రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

ఆన్‌లైన్ గేమ్ పేరిట సైబర్ మోసం

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ వ్యక్తిని ఆన్‌లైన్ గేమ్ పేరిట సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో గేమ్ పేరిట చేర్చారు. అనంతరం సదరు వ్యక్తితో గేమ్‌లో రూ.5వేలుతో ప్రారంభించి, పలు దఫాలుగా డబ్బులు వేయించుకున్నారు. ఇప్పటి వరకు రూ.11లక్షల వరకు చెల్లించినట్లు సదరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తెలిపారు. ఈమేరకు నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.11 లక్షలు సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో మోసం చేశారని తెలిపారు. వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులపై దాడి

– ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కామారెడ్డి టౌన్: పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఓ వర్గం వారు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గల ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర వేడుకల్లో భాగంగా ఈనెల 25న విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించగా.. ఓ విద్యార్థి పలుమార్లు అంతరాయం కలిగించాడు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థిని మందలించారు. అనంతరం సదరు విద్యార్థి తన మిత్రులకు సమాచారం ఇవ్వడంతో ఓ వర్గానికి చెందిన సుమారు 20మంది పాఠశాలకు వచ్చి, ఉపాధ్యాయులను చితకబాదారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని బెదిరించి, సముదాయించారు. ఇరువురితో మాట్లాడి పోలీసులు శాంతిపజేశారు.

బ్యాంక్‌లో చోరీకి యత్నించిన నిందితుడి అరెస్టు

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని శాంతాపూర్‌లో గల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఇటీవల చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 17న రాత్రి నిందితుడు యాలకంటి మల్లేష్ బ్యాంకు తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లగా.. అలర్ట్ అల్లారం మోగడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరా పుటేజిలను పరిశీలించారు. నిందితుడు చిన్న తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన యాలకంటి మల్లేష్‌గా గుర్తించి, పట్టుకున్నట్లు తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి ఈసందర్భంగా ఎస్సై సూచించారు.

ప్రమాదవశాత్తు దుకాణం దగ్ధం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు మటన్ దుకాణం దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం పోలీస్ స్టేషన్– బస్టాండ్ వెళ్లే రహదారి పక్కన ఉన్న హరిప్రసాద్ మటన్ షాప్ వెనకాల స్థానికులకు గురువారం పాము కనిపించింది. దీంతో వారు పామును చంపేందుకు మంటను పెట్టారు. మంటలను ఆర్పకుండ అలానే వదిలేయంతో మటన్‌షాప్‌కు మంటలంటుకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అయినా షాప్ పూర్తిగా దగ్ధం కావడంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి ఎక్స్‌రోడ్డులో ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయి కుమార్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి తనిఖీలు చేయగా.. నెహ్రూనగర్‌కు చెందిన షేక్ రహీం ఆటోలో తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల బియ్యంను పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పలు కేసుల్లోని నిందితుడి అరెస్టు



పల్లపు మల్లేష్

ఖలీల్ వాడి: జిల్లాలో పలు కేసులలో నిందితుడిగా ఉన్న నాగారంకు చెందిన పల్లపు మల్లేష్ (40)ను పట్టుకొని, అరెస్టు చేసినట్లు ఎస్సై సాయినాథ్ శుక్రవారం తెలిపారు. నిందితుడు కోర్టులో హాజరవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నాడని, ఇతనిపై నాన్ బెయిలబుల్ వారంట్ ఉందన్నారు. అతడిని చాకచక్యంగా పట్టుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించిందన్నారు. ఈసందర్భంగా నార్త్ రూరల్ సీఐ నరహరి, ఐదో టౌన్ ఎస్సై సాయినాథ్, సిబ్బందిని ఏసీపీ వెంకటేశ్వర్ అభినందించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శనివారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్ఎం ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సమస్యలు, సూచనలను అందజేయాలన్నారు. కింది వాట్సాప్ నెంబర్లకు మెసేజ్ చేయగలరని తెలిపారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్	9959226011
డివిజినల్ మేనేజర్, నిజామాబాద్	9959226013
డిపో మేనేజర్, నిజామాబాద్–1	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్–2	9959226017
డిపో మేనేజర్, ఆర్మూర్	9959226019
డిపో మేనేజర్, బోధన్	9959226001
డిపో మేనేజర్, కామారెడ్డి	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ	9959226020

దేశంలో బడ్జెట్ కేటాయింపులే కీలకం

తెయూ(డిచ్‌పల్లి): అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో బడ్జెట్ కేటాయింపులు చాలా కీలకంగా మారుతాయని తెలంగాణ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగాధిపతి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం తెయూ అర్థశాస్త్ర విభాగంలో 'ప్రి బడ్జెట్ అనాలసిస్ -సింపోసిజం' నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. బడ్జెట్ కేటాయింపులు దేశాభివృద్ధికి దారులు వేస్తాయన్నారు. పెట్టుబడి పద్ధతికి అధికంగా బడ్జెట్ కేటాయించినట్లయితే దీర్ఘకాలంలో దేశం అభివృద్ధి చెందుతుందని అధ్యాపకులు పున్నయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. అధ్యాపకులు స్వప్న, శ్రీనివాస్, దత్తహరి, ప్రభంజన్, రామలింగం, నర్సయ్య, ప్రవీణ్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుకొమ్మని మందలించడంతో ఆత్మహత్య!



నివర్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: జులాయిగా తిరగవద్దని, చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై బాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మంగ్యాల గ్రామానికి చెందిన సోన్‌కాబ్లే రోహిదాస్, అనితాబాయిలకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు గతంలోనే వివాహాలు జరిపించారు. వారిద్దరూ రెండు నెలలుగా కామారెడ్డి మండలం రాఘవపూర్ వద్దనున్న ఓ ఇటుక బట్టీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వారి చిన్న కుమారుడైన నివర్తి (19) స్వగ్రామంలోనే ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 20న తల్లిదండ్రుల దగ్గరకని రాఘవపూర్‌కు వచ్చాడు. గురువారం రాత్రి తల్లిదండ్రులు బయటకు వెళ్లగా.. నివర్తి ఇంటి రేకుల షెడ్డు కొక్కానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. నివర్తి కొద్దిరోజులుగా మద్యానికి బానిసై జులాయిగా మారినట్లు తెలిసింది. జులాయిగా తిరగవద్దని, చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్య కారణంతో యువకుడు..

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో గురువారం రాత్రి ఓ యువకుడు అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన అంగాల్ల రమేష్(36) ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి రమేష్ ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్క గదిలోని భార్య, పిల్లలు తండ్రి కోసం గదిలోకి వెళ్లి చూడగా, రమేష్ విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, పంచనామ నిర్వహించారు. రమేష్ గత కొంతకాలంగా నడుము నొప్పితో బాధపడుతున్నాడని, ఈ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమై.. శవమై తేలిన యువకుడు

- తూప్రాన్‌లోని వ్యవసాయ బావిలో తిప్పాపూర్ వాసి మృతదేహం లభ్యం



గొడుగు నరేష్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల మెదక్ జిల్లా తూప్రాన్‌లో అదృశ్యమై.. శుక్రవారం వ్యవసాయ బావిలో శవమై తేలాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గొడుగు నరేష్(26) ఏడాదికాలంగా తూప్రాన్‌కు చెందిన రుక్మోద్దీన్ వద్ద పశువుల కాపారిగా పనిచేస్తున్నాడు. తూప్రాన్‌లోనే ఓ ఇల్లు అద్దెకు తీసుకొని భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 21న నరేష్ పశువుల వద్దకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో నరేష్ భార్య మమత తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా.. నరేష్ సెల్‌ఫోన్‌లోని కాల్ సమాచారం మేరకు ఇద్దరు అనుమానితులను పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ సమీపంలోని వ్యవసాయబావుల వద్ద వెతుకగా నరేష్ మృతదేహం లభించింది. అనుమానితులే నరేష్‌ను హత్య చేసి బావిలో పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. నరేష్ మృతదేహన్ని గ్రామానికి తీసుకవచ్చేందుకు గ్రామస్తులు, కులస్తులు తూప్రాన్‌కు బయలుదేరారు.